క్లుప్తంగా

మంత్రిని కలసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసిన కొమురవెల్లి కాంగ్రెస్ నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు, ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన గౌడ సంఘం నాయకులను లక్ష్మారెడ్డి మంత్రికి పరిచయం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, రాజు గౌడ్, నరేష్, విష్ణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన నిర్మాణాలు



మాచాపూర్‌లో పిల్లర్లకే పరిమితమైన రెడ్డి కమ్యూనిటీ హాల్

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్‌లో సామాజిక భవనాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు. రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన రెడ్డి సామాజిక భవనం నిర్మాణానికి 2018లో శంకుస్థాపన చేశారు. అది పిల్లర్ల దశ దాటలేదు. అలాగే రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం స్లాబ్ వరకు పూర్తయ్యింది. అధికారులు స్పందించి నిర్మాణాలు పూర్తి చేస్తే వినియోగంలోకి తేవాలని ఆయా సామాజిక వర్గాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


వర్గల్‌లో కొలువైన శ్రీచంద్రమౌళీశ్వరుడు



శిఖర కలశాలకు పూజలు చేస్తున్న శ్రీమాధవానంద సరస్వతి

వర్గల్(గజ్వేల్): వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంలో శ్రీచంద్రమౌళీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం ఉదయం భక్తుల జయజయధ్వానాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య గురుమదనానంద పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి ఆధ్వర్యంలో వేదపండితులు నరసింహమూర్తి, ఉమామహేశ్వరశర్మ పరివారం స్థాపిత దేవతా పూజలు, గర్తన్యాసాది వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. నూతన ఆలయంలో కొలువైన శ్రీచంద్రమౌళీశ్వరుడిని భక్తులు దర్శించి పూజలు చేశారు. ఆలయ నిర్మాణదాత అనిల్, అర్చన దంపతులను చంద్రశేఖర సిద్ధాంతి ఆలయం తరఫున ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సంతాన మల్లికార్జున క్షేత్ర వ్యవస్థాపకుడు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు యాయవరం రాజశేఖర శర్మ, దాచేపల్లి వెంకటకృష్ణ, ఇర్రి మల్లారెడ్డి, గంగిశెట్టి సుధాకర్‌గుప్త, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగులో బయోచార్‌పాత్ర కీలకం



మర్కూక్‌లో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి శివప్రసాద్

మర్కూక్(గజ్వేల్): బయోచార్ సేంద్రియ ఎరువులను సీడ్స్ కంపెనీ రైతులకు ఉచితంగా అందజేయడం అభినందనీయమని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని రైతులకు బయోచార్ సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోచార్ తక్కువ ఆక్సిజన్ వాతావరణంలో కంటే పంట అవశేషాలను వేడి చేయడం ద్వారా తయారు చేసిన బొగ్గు ముక్క రూపమన్నారు. నేల నీటిని నిల్వ చేసే సామర్థ్యం, పోషకాలను వినియోగించుకునే సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగేందర్‌రెడ్డి, సీడ్స్ కంపెనీ ప్రతినిధులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ముత్తన్నపేటలో గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లిన మహిళలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ముస్తాబైన నాచగిరి క్షేత్రం

- నేటి నుంచి శ్రీలక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవం
- 12 రోజుల పాటు ఉత్సవాలు
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు

నాచగిరి పవిత్ర పుణ్యక్షేత్రం..హరిద్రనది గలగలలు.. ప్రకృతి రమణీయత కలబోసిన సహజసిద్ధ కొండగుహల్లో శ్రీలక్ష్మీనృసింహస్వామి కొలువైన భవ్యక్షేత్రం.. తూర్పుదిశలో స్వామివారి పాదాలు తాకుతూ ఉత్తరం మీదుగా పడమరవైపు సాగిపోయే హరిద్ర ఒడ్డున ఉంది. వర్గల్ మండలం నాచగిరి క్షేత్రంలో శుక్రవారం నుంచి పన్నెండు రోజులపాటు స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక అనుభూతులు పంచనున్నాయి.

వర్గల్(గజ్వేల్): రాష్ట్రంలో రెండో యాదగిరిగుట్టగా సుప్రసిద్ధమైన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారంగుట్ట శ్రీలక్ష్మీనృసింహక్షేత్రం బ్రహ్మాండనాయకుని నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 29వ తేదీన ఫాల్గుణ బహుళ పంచమి శుక్రవారం నుంచి ఏప్రిల్ 9 చైత్ర శుద్ధ పాడ్యమి మంగళవారం వరకు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రధాన ఆలయం, విమాన గోపురం, తూర్పు, ఉత్తర ద్వారాలు, సభా మండపం, కల్యాణ మండపాలను రంగులతో తీర్చిదిద్దారు. ఆలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుద్దీపాల వరుసలతో అలంకరించారు. స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. భక్తులు బసచేసేందుకు సత్రాలు సిద్ధం చేశారు.



నాచగిరి ఆలయం



అదనంగా చలువ పందిళ్లు నిర్మించారు.

క్షేత్ర మహత్యం

గార్గేయ మహర్షి, నవనాథ మునులు తపమాచరించిన ప్రదేశం నాచగిరి. శేషశాయి మాదిరి గుహలో స్వామివారు స్వయంభువుగా కొలువుదీరారు. శ్రీస్వామివారిని దర్శించుకుంటే శత్రుబాధ, భూత, ప్రేత, పిశాచ బాధలు తొలగిపోతాయని, దీర్ఘరోగాలు నయమవుతాయని, కోర్టు తగాదాలు పరిష్కారమవుతాయని, అవివాహితులకు వివాహాలు జరుగుతాయని, పిల్లలులేనివారికి సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

భాగ్యనగరానికి 55 కిలోమీటర్ల దూరంలో..

నాచగిరి క్షేత్రం భాగ్యనగరానికి 55 కిలోమీటర్లు, 44వ నంబర్ జాతీయ రహదారి తూప్రాన్ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. సికిందరాబాద్ నుంచి ప్రజ్ఞాపూర్ మీదుగా కూడా నాచగిరికి చేరుకోవచ్చు. నాచగిరి క్షేత్రానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది.

బ్రహ్మోత్సవాల వివరాలు

- 29వ తేదీ శుక్రవారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ,
- 30న ధ్వజారోహణం, 31న ఆదివారం రాత్రి 10 గంటలకు, స్వామివారి తిరుకల్యాణం, ఏప్రిల్ 1న హంస వాహనసేవ, 2న గజవాహనసేవ,
- 3న శేషవాహన సేవ
- 4న పెద్దగరుడసేవ, 5న హనుమంతోత్సవసేవ, 6న పొన్నవాహనసేవ, 7 తేదీ రాత్రి రథోత్సవం, 8న తెల్లవారుజామున రథంపై స్వామివారి ఊరేగింపు, 9వ తేదీన శతఘటాభిషేకం, ఉగాది పంచాంగశ్రవణం

ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. 45 సత్రాలు, 17 అతిథిగృహాలు సిద్ధం చేశాం. యాత్రికులు సేదతీరేందుకు చలువపందిళ్లు వేయించాం. అదనంగా తాత్కాలిక శౌచాలయాలు ఏర్పాటు చేస్తున్నాం. భక్తుల సౌకర్యాల కోసం వీలైనన్ని చర్యలు తీసుకుంటున్నాం. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీస్ యంత్రాంగం సేవలు తీసుకుంటున్నాం. వైద్యం, ఎక్సైజ్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు సేవలందించాలని కోరాం.

– అన్నపూర్ణ, నాచగిరి ఈఓ



నంగునూరులో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు

సీపీ అనురాధ

మద్దూరు(హుస్నాబాద్): శాంతియుత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలని సీపీ అనురాధ అన్నారు. గురువారం మద్దూరు పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పోలీసు స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతో కలిసి ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించాలన్నారు.

పోలీసుల కవాతు

దుబ్బాకటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటువేయాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. ఓటర్లకు భరోసా కల్పించడానికే దుబ్బాకలో కేంద్రబలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు విలువైందన్నారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదు చేసేవారు 1950 కాల్ చేయాలని సూచించారు.

నంగునూరులో..

నంగునూరు(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా హింసాత్మక సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సిద్దిపేట రూరల్‌సీఐ శ్రీను అన్నారు. కేంద్ర బలగాలు, పోలీసులతో కలసి గురువారం నంగునూరులో కవాతు నిర్వహించారు.

మహాసభలను జయప్రదం చేద్దాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఏప్రిల్ 3, 4 తేదీల్లో సిద్దిపేటలో నిర్వహించే ఎస్ఎఫ్ఐ జిల్లా 5వ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ అన్నారు. గురువారం జిల్లా మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ మహాసభల్లో విద్యారంగ సమస్యలపై సమీక్ష నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో ఎగిరేది బీజేపీ జెండానే

బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

సిద్దిపేటరూరల్: దేశం కోసం బీజేపీ నేతృత్వంలోని మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు మద్దతు పలుకుతున్నారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్‌లో బీజేపీ జెండా ఎగురుతుందని ఆ పార్టీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. గురువారం నారాయణరావుపేటలో బూత్ కమిటీ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి డబ్బు ఇచ్చి పార్టీ టికెట్ తెచ్చుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, అధికార ప్రతినిధి జిల్లెల్ల రమేష్, మెదక్ కోకన్వీనర్ సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాబిషన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్, మండల అధ్యక్షుడు బాబు, బీజేవైఎం మండల అధ్యక్షుడు కరుణాకర్, గ్రామ అధ్యక్షుడు స్వామి, బూత్ ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

బీజేపీ కార్యాలయం ప్రారంభం

సిద్దిపేటరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీకి ఓటువేసేలా చైతన్యపరచాలని ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. గురువారం రూరల్ మండల పరిధిలోని రాఘవాపూర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటుగా మండల అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ అధ్యక్షతన మండల స్థాయి ముఖ్య కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జీల సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలే మిగిలాయి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ఎండిన పంటలు, కరెంట్ కోతలే మిగిలాయని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం దుబ్బాకలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లా గులాబీ అడ్డా అని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. శుక్రవారం దుబ్బాక నియోజకవర్గ కార్యకర్తల సమావేశం పట్టణంలోని రజనీకాంత్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందన్నారు. సమావేశానికి ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ హాజరవుతున్నారన్నారు.



దుబ్బాకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మురళీమోహన్

హుస్నాబాద్: హుస్నాబాద్ కోర్టు ఆవరణలో గురువారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవి కోసం నలుగురు పోటీ పడ్డారు. మురళీమోహన్‌కు 19 ఓట్లు, చిత్తారి రవీందర్‌కు తొమ్మిది ఓట్లు, పిట్టల దేవదాస్‌కు నాలుగు ఓట్లు, కొత్తపల్లి దేవేందర్‌కు మూడు ఓట్లు వచ్చినట్లు ఎన్నికల అధికారి జాల జ్యోతికుమార్ ప్రకటించారు. దీంతో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విలాసాగరం మురళీమోహన్ ఎన్నికైనట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా కన్నోజు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గుగులోతు జుంలాల్, సహాయ కార్యదర్శిగా జేరిపోతుల రవీందర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ప్రవీణ్ కుమార్ ఎన్నికయ్యారన్నారు. నూతన కార్యవర్గానికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని శుభాకాంక్షలు తెలిపారు.



మురళీమోహన్

ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

- క్యాంపు నుంచి నేరుగా సమావేశానికి వచ్చిన ఎంపీటీసీలు
- గౌరవం ఇవ్వలేదని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ
- మంచాల అనసూయకు ఎంపీపీ పదవి దక్కే అవకాశం

కొండపాక(గజ్వేల్): కొండపాక మండల బీఆర్ఎస్ పార్టీ ఎంపీపీ ర్యాగల్ల సుగుణపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందంటూ గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్ ప్రకటించారు. ఎంపీపీపై ఈనెల 5వ తేదీన అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ తొమ్మిది మంది ఎంపీటీసీలు ఆర్డీఓకు తీర్మాన ప్రతిని అందజేసి క్యాంపులోకి వెళ్లారు. అవిశ్వాస తీర్మానానికి 28వ తేదీ గడువు ఇచ్చారు. గురువారం సభ్యులు క్యాంపు నుంచి నేరుగా సమావేశానికి హాజరయ్యారు. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు తొమ్మిది మంది ఎంపీటీసీలు అవసరం. వారిలో కుకునూరుపల్లి ఎంపీటీసీ బూరవైన భూములుగౌడ్ మినహా మిగిలిన ఎనిమిది మంది కార్యాలయానికి వచ్చారు. అవిశ్వాస తీర్మానానికి ఖమ్మంపల్లి ఎంపీటీసీ పెద్దసాయిగాని యాదగిరి మద్దతు తెలపడంతో అవిశ్వాసం నెగ్గింది. ఈవిషయం ఉన్నతాధికారులకు నివేదిక పంపి ఎంపీపీ పదవి ఎన్నిక తేదీని వెల్లడిస్తామని ఆర్డీఓ తెలిపారు. ఎంపీపీ పదవి బీసీ మహిళకు కేటాయించడంతో కొండపాక ఎంపీటీసీ మంచాల అనసూయకు దక్కనుండటంతో కాంగ్రెస్‌లో చేరితే మద్దతు ఇస్తామని ఇద్దరు ఎంపీటీసీలు చెప్పడంతో ఆమె కాంగ్రెస్‌లో చేరకతప్పలేదు.

పోలీస్ బలగాల మధ్య..

బీఆర్ఎస్ పార్టీకి కొండపాక మండలం కంచుకోట. దీంతో తొగుట సీఐ లతీఫ్ ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ బలగాలను బందోబస్తుగా ఏర్పాటు చేశారు. అవిశ్వాస తీర్మానం నెగ్గించుకోవడానికి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిందన్న విషయాన్ని ఆర్డీఓ ప్రకటించే వరకు నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.



అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా మద్దతు తెలిపిన ఎంపీటీసీ సభ్యులు

సరైన గౌరవం లేక పార్టీ మారా

బీఆర్ఎస్ పార్టీలో సరైన గౌరవం దక్కకపోవడం, ఇప్పటి వరకు నిధులు మంజూరు కాకపోవడంతో ఉత్సవ విగ్రహంలా మిగిలిపోయానని ఎంపీపీ అభ్యర్థి మంచాల అనసూయ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరుస్తుండటంతో పార్టీ పట్ల ఆకర్షితురాలినయ్యానన్నారు. మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ ఇన్‌చార్జి తూంకుంట నర్సారెడ్డి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు విరుపాక్ష శ్రీనివాస్‌రెడ్డి, లింగారావు, నాయకులు చిన్న శ్రీనివాస్, రవీందర్, శివ, ఉపేందర్, దొమ్మాల లక్ష్మారెడ్డి, మల్లేశం, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రోస్ మందులతో పంట దెబ్బ తినలేదు

గజ్వేల్ డివిజన్ వ్యవసాయాధికారి బాబూనాయక్

కొండపాక(గజ్వేల్): ఆగ్రోస్ పురుగుల మందుల పిచికారీతో వరి పంట దెబ్బతినలేదని గజ్వేల్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి బాబూనాయక్ తెలిపారు. కొండపాక ఐటీసీ కార్యాలయంలో గురువారం ల్యాబ్ రిపోర్టును విలేకరులకు చూపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని దుద్దెడకు చెందిన రైతు చిలుముల శ్రీనివాస్ ఈనెల 10వ తేదీన వెలికట్ట శివారులోని ఆగ్రోస్ కేంద్రం నుంచి వరి పంట తెగుళ్ల నివారణ మందులు తీసుకెళ్లాడన్నారు. తీసుకెళ్లిన మందులు పిచికారీ చేస్తే పంట దెబ్బతిందంటూ ఆగ్రోస్ కేంద్రం వద్ద ఆందోళనకు దిగాడన్నారు. కేంద్రం నిర్వాహకుడు ఈ విషయాన్ని ఏఈఓ, పెరుగు మందుల కంపెనీ దృష్టికి తీసుకెళ్లాడని చెప్పారు. ల్యాబ్‌లో టెస్ట్ చేయగా ఆగ్రోస్ పురుగుల మందు కాదని నివేదిక వచ్చిందన్నారు. తెగులు నివారణ మందులో గడ్డి మందు కలపడంతో పంట దెబ్బతిందని తెలిపారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారులు సూచించిన మందులు వాడాలన్నారు.



మాట్లాడుతున్న డీఏఓ బాబూనాయక్

మున్సిపల్ మేనేజర్‌పై ఫిర్యాదు

సిద్దిపేటరూరల్: సిద్దిపేట మున్సిపాలిటీ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి తప్పుడు ధ్రువపత్రాలతో పదోన్నతి పొందాడని, విచారణ జరిపి అతడిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ ఫర్ ఆర్టీఐ ప్రెసిడెంట్ షాదుల్ గురువారం కలెక్టర్ మను చౌదరికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ మేనేజర్‌గా వచ్చిన కొద్దికాలానికే అతడిపై ఎన్నో ఆరోపణలు వచ్చాయన్నారు. ఆర్టీఐ ద్వారా సమాచారం కోరగా పదోన్నతి కోసం 1996లో నిర్వహించిన డిపార్ట్‌మెంటల్ 146, 148 పరీక్ష రాసిన వారి వివరాలు అందించారన్నారు. శ్రీనివాస్‌రెడ్డి 148 మాత్రమే పాసయ్యారని, 146 పాస్ కాలేదన్నారు. తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి పదోన్నతి పొందాడన్నారు. దీనిపై అప్పటి మున్సిపల్ కమిషనర్‌కు, రాష్ట్ర మున్సిపల్, కమిషనర్ శాఖకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు.

రోడ్డు తవ్వి పైపులైన్ నిర్మాణం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం బంజేరుపల్లి గ్రామ పరిధిలోని పల్లెలకు రవాణ సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం ఇటీవలే తారు రోడ్డు నిర్మాణం చేపట్టడంతో గుంటూరుపల్లి, అంబాయిపల్లి, గొల్లపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అయితే బుధవారం ఓ రైతు ప్రభుత్వ అనుమతి లేకుండా రోడ్డును తవ్వి తన పొలానికి పైపులైన్ వేయించాడు. రోడ్డును త్వవడంపై గ్రామస్తులు గురువారం పంచాయతీరాజ్ ఏఈ, డీఈలకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకొని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



సంక్షిప్త వార్తలు

◆ 31న సాహిత్య సదస్సు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈ నెల 31వ తేదీన జిల్లా కేంద్రంలోని హరిహర రెసిడెన్సి ఆవరణలోగల శ్రీలలితా చంద్రమౌళీశ్వర దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా ఆశు కవితా పద్యధార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు పండరి రాధాకృష్ణ, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం గురువారం తెలిపారు. రాష్ట్రస్థాయిలోని ప్రముఖ పద్యకవులు పాల్గొంటున్నారన్నారు.

◆ రంజాన్ తోఫా పంపిణీ చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ముస్లింలకు పంపిణీ చేసే రంజాన్ తోఫాలను ప్రభుత్వ అధికారులే పంపిణీ చేయాలని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రంజాన్ తోఫాను అధికారులు మాత్రమే అందజేయాలన్నారు. రంజాన్ తోఫా సంచులపై రాజకీయ నాయకుల ఫొటోలు పెట్టొద్దన్నారు. జిల్లాలోని కొందరు తంజీం, బీఆర్ఎస్ నాయకులు ఫొటోలు పెట్టి గుట్టు చప్పుడు పంపిణీచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజుద్దీన్, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రషీద్, అనిల్, చోటు పాల్గొన్నారు.

◆ గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పండరి

గజ్వేల్: గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన న్యాయవాది చెన్‌రాజు పండరి ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో ముగ్గురు పోటీపడ్డారు. హరికృష్ణ, ఖాజా మిస్కిన్‌లపై పండరి అత్యధిక ఓట్లతో గెలుపొందారు.

◆ నూతన కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేటకమాన్: సిద్దిపేట బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మంతూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా మహేష్, సంయుక్త కార్యదర్శిగా వెంకటాచారి, కోశాధికారిగా బాబు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా రామకృష్ణ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా శివాజీ గణేష్, శ్రీనివాస్ వ్యవహరించారు.

◆ ప్లాస్టిక్ వ్యర్థాలు పారబోయొద్దు

హుస్నాబాద్‌రూరల్: ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తే వాటిని పశువులు మేస్తే మరణించే ప్రమాదం ఉందని మండల వ్యవసాయ అధికారి నాగరాజు అన్నారు. గురువారం కిషన్‌నగర్‌లో హోటల్స్ దగ్గర, పెట్రోల్ బంక్‌లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కప్పులో టీ తాగితే అనారోగ్య సమస్యలు వస్తాయని సీసా గ్లాసులు వాడాలని హోటల్ నిర్వాహకులకు చెప్పారు. మట్టిలో కరిగేవాటిని వాడటం వలన భూసారం దెబ్బతినకుండా ఉంటుందన్నారు. ప్లాస్టిక్ నివారణకు అందరు కలిసి వచ్చి ప్లాస్టిక్ రహిత గ్రామంగా గాంధీనగర్‌ను నిలుపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హారిక తదితరులు ఉన్నారు.

◆ చదువుతోపాటు సమాజసేవ

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో భాగస్వాములు కావాలని గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లిలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 స్పెషల్ క్యాంప్‌ను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయభాస్కర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, అధ్యాపకులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటేశం, ఎంపీటీసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ థియేటర్‌కు తాళం

గజ్వేల్‌రూరల్: వ్యాపారులు, గృహ యజమానులు ఈనెలాఖరులోగా ఆస్తిపన్ను చెల్లించాలని, లేనిపక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య హెచ్చరించారు. ఆస్తిపన్ను బకాయి ఉన్నందున పట్టణంలోని తిరుమల థియేటర్‌కు తాళం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక పన్ను బకాయి ఉన్న స్కూల్స్, కళాశాలలు, ఫంక్షన్ హాల్స్, పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్ల యజమానులు వెంటనే బకాయి చెల్లించాలన్నారు. ఆస్తిపన్ను చెల్లింపులో 90 శాతం రాయితీ మార్చి 31 వరకు మాత్రమే ఉందన్నారు.

◆ 'చేనేత'కు చేయూత ఇవ్వాలి

గజ్వేల్‌రూరల్: చేనేతకు ప్రభుత్వం చేయూతనందించి ఆదుకోవాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీష్ అన్నారు. గురువారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటుచేసిన చేనేత విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత చేనేత వృత్తికి విశేష ప్రాధాన్యత ఉందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, వేములఘట్ మాజీ ఉపసర్పంచ్ బాలకిషన్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.